అందరి సహకారంతో కోట బోనాలు విజయవంతం



శ్రీనివాసరాజ్‌ను సన్మానిస్తున్న రాజు వస్తాద్‌ తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు అందరి సహకారంతో విజయవంతమయ్యాయని గోల్కొండ పీస్‌ అండ్‌ మైత్రి కమిటీ ఛైర్మన్‌ ఎస్‌.రాజువస్తాద్‌ అన్నారు. ఆదివారం జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఇ.శ్రీనివాసరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల ఏర్పాట్లలో శ్రీనివాసరాజు సమర్థవంతంగా పనిచేశారన్నారు. బోనాలు విజయవంతంగా జరగడంలో పీస్‌ అండ్‌ మైత్రి కమిటీ సభ్యులు, స్థానిక హిందూ ముస్లింల సోదరులతో పాటు అమ్మవారి వృత్తిపనివారి సంఘం వారి పాత్ర ఎంతగానో ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వణాధికారి వృత్తిపనివారికి గౌరవ వేతనంతో పాటు అమ్మవారి ఒడిబియ్యం, చీరలు పంపిణీ చేశారు. అనంతరం అమ్మవారి వృత్తిపనివారి సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా టి.శివశంకర్‌, ఉపాధ్యక్షుడిగా బొమ్మల శ్రీకాంత్‌చారి ఎన్నికయ్యారు. వీరి పదవీ కాలం రెండేళ్లు ఉంటుందని ఎస్‌.రాజువస్తాద్‌ తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ రాజ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సత్యం రెడ్డి, నాగన్న, బి.సాయి బాబాచారి, శ్రీకాంత్‌చారి ఉన్నారు.

గోషామహల్‌ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసిన మమతా గుప్తా, సంతోష్‌గుప్తా

అబిడ్స్‌: గోషామహల్‌ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే దానం నాగేందర్‌ సహకారంతో కృషి చేస్తామని గోషామహల్‌ నియోజకవర్గం కాంగ్రెస్‌ నాయకులు, మాజీ కార్పొరేటర్‌ మమతా గుప్తా, సంతోష్‌గుప్తా పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలలా నిరంతరం పర్యటించి ఎమ్మెల్యే దానం నాగేందర్‌ సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. దానం నాగేందర్‌ను ఘనంగా సత్కరించి గోషామహల్‌ సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మమతాగుప్తా, సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పలు బస్తీలు, మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో పలు సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆ సమస్యలు అన్ని దానం నాగేందర్‌ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని మమతా గుప్తా, సంతోష్‌గుప్తా పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిపాదుకల పూజ



సాయిపాదుకల పూజల్లో ముత్యాల శేఖర్‌బాబు, సుమలత, లీలావతి

లంగర్‌హౌస్‌: సాయినాథుని నామస్మరణతో లంగర్‌హౌస్‌, ప్రశాంత్‌నగర్‌ ప్రాంతాల్లో మారుమ్రోగాయి. సాయిటెక్‌ పెయింట్‌ అధినేత దివంగత ముత్యాల కృష్ణ స్వగృహంలో సాయిబాబా ఆలయం నిర్మించి 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఆలయ నిర్మించిన రోజున షిరిడీ నుంచి స్వయంగా సాయి బాబా వేసుకున్న పాదుకలు, ఆయన వస్త్రాలను ఇక్కడకు తీసుకురావడం ఆనవాయితి. ఇందులో భాగంగా సాయిటెక్‌ కృష్ణ కుమారుడు ముత్యాల శేఖర్‌బాబు, సుమలత దంపతులు సాయిబాబా పాదుకలు, బాబా ధరించిన కఫిని వస్త్రం తీసుకువచ్చారు. ఈ పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బాబా పాదుకలు, వస్త్రాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల లీలావతి, గణసాయి, సాయిచరణ్‌, మౌనిక పాల్గొన్నారు.

గోల్కొండలో 10కే రన్‌



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా

గోల్కొండ: గోల్కొండ కోట వద్ద కేఎస్‌ఆర్‌ సైక్లింగ్‌ నాగరాజు ఆధ్వర్యంలో తెలంగాణ హిస్టారికల్‌ 10కే రన్‌, రైడ్‌ జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్‌, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్‌ జాతీయ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన భాష మన హక్కు అని, మన వనరుల సంపద మనకు ముందుబాట అని అన్నారు. మన తెలంగాణలో చారిత్రక కళా ఖండాలు, కట్టడాలు ఎన్నో ఉన్నాయన్నారు. మన సంస్కృతి, ఆత్మగౌరవం ఎందరో మహానుభావుల త్యాగ నీరతికి స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో లిటిల్‌ ఉటోపియా సాయికిరణ్‌, వందేమాతం ఫౌండేషన్‌ మాధవరెడ్డి, మేకలస్‌ వెంటురేస్‌ భరత్‌, టికీ రైడ్‌ టీం రఘు, శ్రీనివాస్‌, వాక్‌ఫిట్‌కు చెందిన మాధవి, రవీందర్‌, యశోద ఆసుపత్రి టీం, సిటీ పోలీస్‌ టీం, జీహెచ్‌ఎంసీ టీం పాల్గొన్నారు. అనంతరం విజేతలకు ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా బహుమతులు అందజేశారు.

ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేందుకు కృషి



కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకుడు ఆనంద్‌సింగ్‌, పప్పుమాత్రే

అబిడ్స్‌: ఆధ్యాత్మిక భావాలు పెంపొందిచేందుకు బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో కృషి చేస్తామని గోషామహల్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకులు ఆనంద్‌ సింగ్‌, పప్పుమాత్రే పేర్కొన్నారు. ఆదివారం ధూల్‌పేట్‌లో నిర్వహించిన శ్రావణమాసం కావడి యాత్రలో వారు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి భక్తులకు మంచినీరు, ఇతర పానీయాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌సింగ్‌, పప్పుమాత్రే మాట్లాడుతూ..సమాజ సేవకే నిరంతరం కృషి చేస్తామన్నారు. ఆధ్యాత్మిక భావాలు, హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను పెంపొందిస్తూ ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌సింగ్‌, ప్రశాంత్‌ సింగ్‌, సంజీవ్‌ సింగ్‌, రోషన్‌ సింగ్‌, దీపక్‌ సింగ్‌, తరుణ్‌ సింగ్‌, అంకిత్‌సింగ్‌లు పాల్గొన్నారు.

మొగిలయ్య గౌడ్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ప్యారసాని వెంకటేష్‌ తదితరులు

చార్మినార్‌: నిజాం నిరంకుశత్వాన్ని లెక్క చేయకుండా స్వతంత్ర్య భారత త్రివర్ణ పతాకాన్ని తెలంగాణ గడ్డపై గర్వంగా ఎగురవేసిన మహా వీరుడు బత్తిని మొగిలయ్య గౌడ్‌ అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్‌ కన్వీనర్‌ ప్యారసాని వెంకటేష్‌ కొనియాడారు. పత్తర్‌గట్టి డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం జరిగిన బత్తిని మొగిలయ్య వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా కిసాన్‌ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌ యాదవ్‌, సంతోష్‌ రాజు, గురు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దర్శకుడు సాగర్‌ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహితీవనం ఆధ్వర్యంలో యువ రచయిత ఎ.విజయ్‌ రచించిన నవలల ఆవిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు సాగర్‌ కె.చంద్ర మాట్లాడుతూ..అమెరికాలో ఉంటూ భాషపై మమకారంతో నవలలను రాయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి, రచయిత మౌనశ్రీ మల్లిక్‌, సంస్థ ప్రతినిధులు శాంతికృష్ణ, సుమన ప్రణవ్‌ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా ప్రభుత్వం

జియాగూడ: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలోనే నిరుద్యోగులకు జాబ్‌ కేలండర్‌, ఆర్టీసీలో ఉద్యోగాలు కల్పించడం హర్షణీయమని కాంగ్రెస్‌ జియాగూడ డివిజన్‌ సహ కార్యదర్శి మహేష్‌బాబు అన్నారు. ఆదివారం రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి అభినందించారు. అనంతరం నిరుద్యోగులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం అండగా ఉండడంతో పాటు అభివృద్ధిని కాంక్షిస్తుందన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్‌ నాయకుడు మహేష్‌బాబు

జిల్లాకు దూరంగా ఉపాధి కల్పన కార్యాలయం

- దూరభారం ప్రయాణాలతో నిరుద్యోగుల అవస్థలు
- పట్టించుకోని రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు
- హైదరాబాద్‌ నుంచి రంగారెడ్డి జిల్లాకు తరలించాలంటూ వినతి



శాంతినగర్‌ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా ఉపాధి శిక్షణా కార్యాలయం

నాంపల్లి: రంగారెడ్డి జిల్లాలో ఉండాల్సిన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం హైదరాబాద్‌ జిల్లాలో కొనసాగుతోంది. దీంతో రంగారెడ్డి జిల్లాకు చెందిన యువత, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంప్లాయిమెంట్‌ రిజిస్ట్రేషన్‌ కోసం రాకపోకలు సాగించడానికి బాగా దూరభారం అవుతోంది. చాలా మంది రైళ్లు, బస్సులు, ఆటోలను పట్టుకుని ఇక్కడికి వస్తుంటారు. పని మీద ఉదయాన్నే ఇంటి దగ్గర బయలుదేరితే ట్రాఫిక్‌, ఇతరత్రా కారణాలతో నాంపల్లిలోని శాంతినగర్‌కు చేరుకోవాలంటే సాయంత్రం అవుతోంది. కార్యాలయం ఏదైనా ప్రజలకు అందుబాటులో ఉండాలి. నిత్యం రంగారెడ్డి జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులు మాత్రం తమకేమి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

పరిపాలన సౌలభ్యం కోసం..

పరిపాలన సౌలభ్యం కోసం ప్రత్యేకంగా ప్రతి జిల్లాలో ఒక కొత్త జిల్లా కలెక్టరేట్‌ను నిర్మించారు. కొత్త రాష్ట్రం ఏర్పాటులో భాగాంగానే రంగారెడ్డి జిల్లాకు కొంగర్‌ కలాన్‌లో అత్యాధునిక జిల్లా కలెక్టరేట్‌ పనిచేస్తోంది. ఒకప్పుడు కలెక్టరేట్‌లోనే అన్ని శాఖలు ఇమడలేక అక్కడక్కడా హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్‌ భవనాలను అద్దెకు తీసుకుని కొనసాగించేవారు. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కలెక్టరేట్‌లోనే కావాల్సినన్ని గదులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌కు అందుబాటులో ఉండాల్సిన అనుబంధ శాఖలన్నీ ఒకే ప్రాంగణంలో కొనసాగే అవకాశం ఉంది. అయితే కలెక్టరేట్‌లో ఉండాల్సిన కొన్ని శాఖలు నేటికీ కలెక్టరేట్‌కు దూరంగానే ఉంటున్నాయి. నూతన కలెక్టరేట్‌ ప్రాంగణాలను ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా జిల్లా కలెక్టరేట్‌కు దూరంగానే ఉంటున్నాయి. ఈ సంస్థలను కలెక్టరేట్‌ ప్రాంగణాల్లోకి తీసుకెళ్లాలనే సోయి రంగారెడ్డి జిల్లా ఉన్నతాధికారులకు లేకుండా పోయింది. త్వరగా జిల్లా కలెక్టరేట్‌కు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని తరలిస్తే అందరికీ సౌలభ్యంగా ఉంటుంది.

ఐటీఐ సెంటర్లన్నీ ఒకే చోటుకు..

ఒకప్పుడు శాంతినగర్‌ క్యాంపస్‌లో ఒకే ఐటీఐ ఉండేది. ఇప్పుడు హైదరాబాదులోని పలు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగే ఐటీఐ సెంటర్లను శాంతినగర్‌ క్యాంపస్‌లోకి మార్చారు. ప్రస్తుతం ఉన్న శాంతినగర్‌ క్యాంపస్‌లోనికి అదనంగా సనత్‌నగర్‌, ఖైరతాబాద్‌ సెంటర్లు కూడా వచ్చి చేరాయి. వీటితో క్యాంపస్‌ ప్రాంగణమంతా ఇరుకిరుకుగా మారిపోయింది. వీటికి తోడు రంగారెడ్డి, హైదరాబాద్‌ జిల్లా ఉపాధి శిక్షణా సంస్థలు, రీజినల్‌ ఎంప్లాయిమెంట్‌ కార్యాలయాలు ఇక్కడే ఉన్నాయి. వీటిని ఆయా కలెక్టరేట్లకు తరలించకపోవడంతో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐలను ఏటీసీ సెంటర్లుగా మార్చే యోచన చేస్తోంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఐటీఐలను ఏటీసీ సెంటర్లుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. ఇందులో భాగంగానే శాంతినగర్‌ క్యాంపస్‌కు పక్కనే ఉన్న మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో ఏటీసీ సెంటర్ల ఏర్పాటుకు భూమి పూజ కూడా చేశారు. ఇలాంటి తరుణంలో మల్లేపల్లి ఐటీఐతో ధీటుగా శాంతినగర్‌ క్యాంపస్‌ కూడా ఏటీసీ సెంటర్‌గా మారిస్తే బాగుంటుందనే అభిప్రాయం శాంతినగర్‌ క్యాంపస్‌ విద్యార్థుల్లో వ్యక్తం అవుతోంది. ఈ క్యాంపస్‌లో రంగారెడ్డి, హైదరాబాద్‌ జిల్లా ఉపాధి శిక్షణా సంస్థలు కలెక్టరేట్‌ ప్రాంగణాలకు తరలివెళ్లకపోవడంతోనే శాంతినగర్‌ క్యాంపస్‌కు ఏటీసీ సెంటర్‌గా మారే యోగం లేకుండా పోయిందని నిట్టూర్చుతున్నారు. ఈ కార్యాలయాలు త్వరలోనే కలెక్టరేట్లకు మారితే శాంతినగర్‌ క్యాంపస్‌లో కూడా ఏటీసీ సెంటర్‌గా ఏర్పాటయ్యే అవకాశం ఉందని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని శాంతినగర్‌ క్యాంపస్‌ను కూడా రెండవ దఫాలో ఏటీసీ సెంటర్‌ కోసం భూమి పూజ చేయాలని కోరుతున్నారు.

సంతోష్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌గా సత్యనారాయణ



సంతోష్‌నగర్‌: సంతోష్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌గా కోలా సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.రఘువీర్‌ రెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో చాంద్రాయణగుట్ట పీఎస్‌లో డీఐగా విధులు నిర్వహిస్తున్న కోలా సత్యనారాయణ సంతోష్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన సత్యనారాయణ మలక్‌పేట్‌, మీర్‌పేట్‌, నాంపల్లి, వనస్థలిపుర పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పని చేస్తున్న సత్యనారాయణను సంతోష్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. దీంతో ఆయన ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్టేషన్‌ పరిధిలో ఎస్సైలు, సిబ్బందితో కలిసి శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా బోనాల వేడుకలు



అమ్మవారికి పూజలు చేస్తున్న సత్యనారాయణ, చిత్రంలో హరిబాబు, పులి శివ

నాంపల్లి: పాత కలెక్టరేట్‌లో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. బోనాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ, మహంకాళి అమ్మవార్ల ఆలయాల కమిటీ చైర్మన్‌ వర్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన ఉద్యోగులు హాజరై అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్‌ కాంగ్రెస్‌ నేత పులి శివ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాల కమిటీ అధ్యక్షులు హరిబాబు, మెడికల్‌ డిపార్ట్‌మెంట్‌ ప్రధాన కార్యదర్శి ఎ.శివకుమార్‌, కాంగ్రెస్‌ నాయకులు రామ్‌రాజ్‌, పీస్‌ కమిటీ సభ్యురాలు యశోదమ్మ పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



జియాగూడ: గణేష్‌ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్‌-ఉన్‌-నబీ వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సౌత్‌వెస్ట్‌జోన్‌ డీసీపీ జి.చంద్రమోహన్‌ అన్నారు. ఈ మేరకు ఆదివారం టప్పాచబుత్రలోని ఏకేఎం ఫంక్షన్‌హాల్‌లో మైత్రి, పీస్‌ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల జరిగిన బోనాలు, మోహర్రం వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. కుల్సుంపురా ఏసీపీ మహ్మద్‌ మునావర్‌ మాట్లాడుతూ..కుల్సుంపురా డివిజన్‌ పరిధిలో సీసీ కెమెరాలను అధిక శాతం ఏర్పాటు చేసినట్లయితే నేరాల అదుపునకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌ శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దారిదోపిడీ కేసులో నిందితుల రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మునావర్‌, ఇన్‌స్పెక్టర్‌ బైరి రాజు

అబిడ్స్‌: ఆటోడ్రైవర్‌ను దారిదోపిడీ చేసిన నిందితులను గుడిమల్కాపూర్‌ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కుల్సుంపురా ఏసీపీ మునావర్‌, గుడిమల్కాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ బైరి రాజు వివరాలు వెల్లడించారు. గత నెల 28న అర్ధరాత్రి రేతీబౌలి చౌరస్తా వద్ద షా నవాజ్‌ అనే ఆటోడ్రైవర్‌ ఆటో స్టాండ్‌లో నిలబడ్డాడు. తిరుమలగిరికి చెందిన పవన్‌, వారాసిగూడకు చెందిన వంశీ ఆటోడ్రైవర్‌ వద్దకు వచ్చి తాము సికింద్రాబాద్‌ వెళ్లాలని ఆటో ఎక్కారు. రాణిగంజ్‌లో తిరుమలగిరికి చెందిన స్టిఫెన్‌, మరో మైనర్‌ బాలుడు కారులో వచ్చి షానవాజ్‌ను కారులో ఎక్కించుకొని తిరుమలగిరి సుభాష్‌నగర్‌కు తీసుకువెళ్లారు. షానవాజ్‌కు కత్తితో బెదిరించి రూ.7800, రెండు వెండి ఉంగరాలు, వెండి గొలుసు, సెల్‌ఫోన్‌ లాక్కున్నారు. ఆటో డ్రైవర్‌ ఫోన్‌లో ఉన్న రూ.1000ను వారి ఫోన్‌ గూగుల్‌ పేలో వేయించుకుని పరారయ్యారు. షానవాజ్‌ ఫిర్యాదు మేరకు గుడిమల్కాపూర్‌ పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల సాయంతో నిందితులైన పవన్‌ (21), వంశీకృష్ణ(21), స్టిఫెన్‌(21)తో పాటు ఓ మైనర్‌ బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా తిరుమలగిరి ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో నమోదైన కార్‌ నెంబర్‌ను సేకరించి ముగ్గురు నిందితులతో పాటు మరో మైనర్‌ బాలుడిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.7700, బైక్‌, రెండు ఫోన్లను స్వాధీన పరచుకున్నారు. ఈ కేసును గుడిమల్కాపూర్‌ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తికి రిమాండ్‌

నాంపల్లి: భార్యను హత్య చేసిన ఘటనలో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం ఉదయం అనుమానంతో భార్యను కత్తితో పొడిచి హత్య చేసిన ఘటన పాఠకులకు విధితమే. ఈ ఘటన నాంపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఏ బ్యాచ్రీలేన్‌ లక్ష్మీనగర్‌లో చోటుచేసుకుంది. కాంగ్రెస్‌ నేత మహ్మద్‌ ఫిరోజ్‌ ఖాన్‌ ఇంట్లో పని చేసే అస్మా బేగం(42)పై భర్త హసన్‌ ఏడాది కాలంగా దూరంగా ఉంటున్నారు. దీంతో ఆమెను చంపాలని భర్త పగను పెంచుకున్నారు. అనుకున్నదే తడవుగా శనివారం శాంతినగర్‌లో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా కత్తితో పొడిచి చెత్తకుప్పలో వేసి వెళ్లాడు. స్థానికులు గమనించి ఆమెను హుటాహుటిన ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. నా భార్యను ఎవరో చంపేశారంటూ ఆసుపత్రిలో సానుభూతిని భర్త ప్రదర్శించే ప్రయత్నం చేశారు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లుగా ఒప్పుకున్నారు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే నిందితుడు హసన్‌ స్థానికంగా టూవీలర్‌ మెకానిక్‌. వరంగల్‌ ప్రాంతం నుంచి నగరానికి వచ్చి స్థిరపడ్డారు. తాగుడుకు బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. అలాగే హత్యకు గురైన భార్య అస్మా బేగం తల్లిదండ్రుల స్వస్థలం కాగజ్‌నగర్‌కు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వీరికి పద్నాలుగేళ్ల కిందట వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్‌ అప్పలనాయుడు తెలిపారు.

పాతబస్తీకి దారేదీ..?

- కనిపించని ఫుట్‌పాత్‌లు.. నడిరోడ్డుపై నడక..
- ఎటుచూసినా చిరు వ్యాపారాలే..
- ముందుకు సాగని వాహనాలు



కాలినడకకు కూడా జాగా లేకపోవడంతో నడిరోడ్డుపై వెళుతున్న సందర్శకులు

చార్మినార్‌: పాతబస్తీకి దారి వెతుక్కోవాల్సి వచ్చింది. ఎటువైపు నుంచి వెళితే తమ గమ్యస్థానాలకు చేరుకుంటాం..అనే మీమాంసలో వాహనదారులున్నారు. మూసీ ఉత్తరం వైపున ఉన్న అఫ్జల్‌గంజ్‌ దాటి నయాపూల్‌ మీదుగా మదీనా ద్వారా చార్మినార్‌ వైపు ముందుకు రావడం.. మళ్లీ తిరుగు ప్రయాణంలో అఫ్జల్‌గంజ్‌ వైపు వెళ్లడం.. వాహనదారులకు ఆదివారం నరకం కనిపించింది. నత్తను తలపించాయి..వాహనాల రాకపోకలు.వాహనదారులకు గుల్జార్‌హౌస్‌ వరకు ఆదివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌ జాం తిప్పలు తప్ప లేదు. కాలినడకకు కూడా వీలు కాని పరిస్థితులు ఎదురయ్యాయి. పర్యాటకులు కాలినడకన ముందుకు వెళ్లలేని దుర్భర పరిస్థితులు ఇక్కడ తలెత్తాయి.

అన్నీ నడిరోడ్డు పైనే..

పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి..ఒక్కటేమిటి పాతబస్తీలో అన్నీ రోడ్లపైనే దర్శనం ఇస్తాయి. వాహనాల పార్కింగ్‌ కూడా నడిరోడ్డు పైనే!.. పర్యాటక పరంగా, వ్యాపార పరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆదివారం చార్మినార్‌ వైపు వెళ్లే రోడ్డులో ట్రాఫిక్‌ రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తుతున్నాయి. పూర్తిస్థాయిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. మదీనా-చార్మినార్‌ ప్రధాన రోడ్డులో ఫుట్‌పాతులే కాదు..రోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. రెగ్యులర్‌గా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఒక ప్లేస్‌ను కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.



చార్‌కమాన్‌- చార్మినార్‌ రోడ్డులో సందర్శకుల సందడి

పోగొట్టుకున్న లగేజీ బ్యాగు అందజేత



నాంపల్లి: ప్రయాణికుడు పోగొట్టుకున్న లగేజీ బ్యాగును హైదరాబాద్‌ రైల్వే ప్రొటెక్షన్‌ ఫోర్స్‌ పోలీసులు అందజేశారు. మహ్మద్‌ మోయిన్‌ ముంబై ఎక్స్‌ప్రెస్‌ రైలులో ఈనెల 10న నగరానికి వచ్చారు. రైలులో ప్రయాణిస్తూ లగేజీ బ్యాగును మరిచిపోయి లింగంపల్లిలోనే దిగిపోయాడు. బాధితుడు అమానత్‌ పథకంలో భాగంగా లింగపల్లి రైల్వేస్టేషన్‌లోని ఆర్‌పీఎఫ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రయాణికుడు పోగొట్టుకున్న లగేజీ బ్యాగును రైల్వే పోలీసులు బాధితుడికి అందజేశారు. లగేజీ బ్యాగులో రూ.3500 విలువైన వస్తువులు ఉన్నాయని హైదరాబాద్‌ ఆర్‌పీఎఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ కల్పన పేర్కొన్నారు. ఇప్పటి వరకు అమానత్‌ పథకం కింద 142 ఘటనల్లో జరిగిన రూ.19,62,870 విలువైన వస్తువులను రికవరీ చేసినట్లు ఆమె తెలిపారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ ఆవిష్కరణ



విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్‌ దాయిబాగ్‌లో నెలకొని ఉన్న హనుమాన్‌ బాలాజీ ఆలయ 16వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించనున్నట్లు హనుమాన్‌ బాలాజీ మందిరం ట్రస్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వాల్‌పోస్టర్‌లను ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. సంస్థ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర



కావడియాత్రలో పాల్గొన్న సోమరాజ్‌సింగ్‌, పరమేశ్వరీ సింగ్‌

అఫ్జల్‌గంజ్‌: కావడి యాత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధూల్‌పేటలో దుర్గా భజన్‌మండల్‌ హజరి బైలెక్‌ ఆధ్వర్యంలో కనుల పండువగా చేశారు. ప్రతి శ్రావణ మాసంలో లోధ్‌ కులస్తులు భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తూ భక్తిగీతాలు పాడుతూ కావడి యాత్ర చేపడుతారు. ఆదివారం గోషామహల్‌ నియోజకవర్గం బీజేపీ నాయకులు, కావడి యాత్ర కన్వీనర్‌ సోమరాజ్‌సింగ్‌, మాజీ కార్పొరేటర్‌ పరమేశ్వరీ సింగ్‌ కావడి యాత్రకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కావడి యాత్రతో ప్రజల్లో భక్తిభావాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌ సింగ్‌ జమేదార్‌, దత్తాసింగ్‌, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబాచారికి సన్మానం



గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తిపని వారి సంఘం అధ్యక్షుడిగా బి.సాయిబాబాచారి ఎంతగానో విశేష కృషి చేశారని ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ శ్రీనివాసరాజ్‌ అన్నారు. ఆదివారం గోల్కొండ కోటలోని ఆలయ ప్రాంగణంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సాయిబాబాచారి పట్టుదల, వృత్తి పనివారి హక్కుల పట్ల నిబద్ధత చూపించారన్నారు. వృత్తిపనివారికి సాయిబాబచారి మార్గదర్శకుడిగా ఉంటూ వచ్చారని ఆయన ప్రశంసించారు.

ఫిలక్‌మాత ఆలయంలో ఘనంగా బోనాలు



దబీర్‌పురా: ఫర్హత్‌నగర్‌లోని ఫిలక్‌ మాత ఆలయంలో ఆలయ ప్రెసిడెంట్‌ కృష్ణకుమార్‌, ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులు నైవేద్యంగా అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం పోతరాజుల నృత్యాలు యువకుల కేరింతలు డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రూప మహేందర్‌, రఘు, జగదీష్‌, నారాయణ, ఎం.కరుణాకర్‌, పరుశురాం, నరేందర్‌, నర్సింహా, రమేశ్‌ కుమార్‌ పాల్గొన్నారు.